

పేదల సంక్షేమమే సర్కారు లక్ష్యం

90 రోజుల్లో 4 గ్యారంటీలు అమలు చేశాం..



వరంగల్‌లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



కేయూలో కె-హబ్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు



మహిళలకు చెక్కులు అందజేస్తున్న మంత్రులు పొంగులేటి, సురేఖ

- నేడు ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- వరంగల్ తూర్పులో రూ.258 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- కేయూ, సమ్మయ్యనగర్‌లో పలు ప్రారంభోత్సవాలు
- పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ఎమ్మెల్యేలు

గిర్మాజీపేట, మార్చి10 : పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ రాజ్యం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లోనే అభయ హస్తంలోని ఆరు గ్యారంటీలలో నాలుగు అమలుచేసి ప్రజల మన్ననలు పొందామన్నారు. ఆదివారం వరంగల్ నగరంలోని ఎస్‌ఎన్‌ఎం క్లబ్ సమీపంలోని మునిసిపల్ స్థలంలో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో రూ.258కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖల మంత్రి కొండాసురేఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కలతో కలిసి మంత్రి పొంగులేటి శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలు చేశారు. అలాగే పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, వికలాంగులకు వాహనాలను మంత్రులు పంపిణీ చేశారు. అలాగే వరంగల్‌లో తాత్కాలిక ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను మంత్రులు ప్రారంభించారు.

అనంతరం మంత్రి సురేఖ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. యువతకు ఉద్యోగం, పేదలకు ఇందిరమ్మ ఇల్లు, ఉచితంగా 10 లక్షల ఆరోగ్యశ్రీ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, రూ.200 యూనిట్లకు ఉచిత విద్యుత్తు పథకాలన్నింటినీ చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామన్నారు. ప్రజల ఆకాంక్షలను గుర్తించి కాంగ్రెస్ నాయకురాలు సోనియ గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తే రెండుసార్లు అధికారం చేపట్టిన కేసీఆర్.. ధనిక రాష్ట్రాన్ని అప్పులు అప్పులు పాలుచేశాడని మండిపడ్డారు. పదేళ్లలో ఒక్క డబుల్‌బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వలేదని ఆరోపించారు. కేసీఆర్ తనకు కావాల్సిన ప్రగతిభవన్‌ను, 250 ఎకరాల ఫామ్ హౌస్‌ను విలాసవంతంగా కట్టుకున్నాడని ధ్వజమెత్తారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్లను గత ప్రభుత్వం లీకేజీలు చేయించడంతో నిరుద్యోగుల ఆవేదన పడ్డారని, వారి బాధను అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. నిజాయితీపరులైన అధికారులతో టీఎస్‌పీఎస్‌ను పక్షాళన చేసి ఉద్యోగ నోటిఫికేషన్‌లు వేస్తున్నారని మంత్రి శ్రీనివాసరెడ్డి గుర్తు చేశారు. అధికారం చేపట్టిన 72 రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం 31వేల ఉద్యోగాలను ఇచ్చిందని, ఎన్నికల హామీలో భాగంగా 2లక్షల ఉద్యోగాలు ఇవ్వడం ఖాయమని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ జాతీయ నాయకులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, మల్లికార్జున ఖర్గేలు ఎన్నికల ముందు ఇచ్చిన అభయహస్తం 6 గ్యారంటీలలో ముఖ్యమైన ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రాచలంలో ప్రారంభిస్తున్నారని మంత్రి పొంగులేటి చెప్పారు. ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలుచేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు చేయూతగా నిలవాలని మంత్రి శ్రీనివాసరెడ్డి కోరారు. మంత్రి కొండా సురేఖ వరంగల్ తూర్పు నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషిచేస్తున్నారని ఆయన ప్రశంసించారు.



కొండా సురేఖ



సీతక్క

మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ప్రజలకు నిజమైన సంక్షేమం అందుతుంటే చూడలేని ఈర్ష్యాపరులు బీఆర్‌ఎస్ నాయకులని ఎద్దేవా చేశారు. ఉద్యోగులకు మొదటి రోజు జీతాలు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, రూ.200 యూనిట్లకు ఉచిత విద్యుత్తు అమలుతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు తమ గుండెల్లో పెట్టుకోవడాన్ని బీఆర్‌ఎస్ నాయకులు తట్టుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. మహిళలకు జీవో 6 ద్వారా అన్యాయం జరుగుతోందని మొత్తుకుంటున్న ఎమ్మెల్సీ కవితకు, అసలు ఆ జీవో తెచ్చిందే వారి ప్రభుత్వమనే విషయం తెలియకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.



వరంగల్ బస్ స్టాండ్ పనులను ప్రారంభిస్తున్న మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి

మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. రాష్ట్రం వచ్చిన 10ఏళ్ల తర్వాత ప్రజలు ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నారన్నారు. ఇప్పటికే నాలుగు గ్యారంటీలు అమలు చేశామని, ఐదో గ్యారంటీ ఇందిరమ్మ ఇల్లు సోమవారం నుంచి అమలులోకి రాబోతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మిగతా 6వ పేజీలో..



హనుమకొండ సమ్మయ్య నగర్ వద్ద అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు

ఆయమూరే.. రమజాన్

- రేపటి నుంచే పవిత్ర ఉపవాస దీక్షలు ప్రారంభం
- నేటి నెలవంక దర్శనం కోసం ఎదురుచూపులు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముస్తాబవుతున్న మసీద్‌లు



ముస్లింల నెలరోజుల ఉపవాస దీక్షల మాసం రంజాన్ వచ్చేసింది. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం ముస్లింలు సోమవారం (నేడు) నెలవంక దర్శనం చేసుకుని, రాత్రి మసీద్‌లో తరావీహ్‌నమాజ్‌ల ద్వారా మంగళవారం నుంచి రంజాన్ ఉపవాస దీక్షల మాసాన్ని ప్రారంభించుకోనున్నారు. పండుగ ఆరంభాన్ని పురస్కరించుకుని ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అన్ని మసీదులను రంగులు, విద్యుత్ దీపాల అలంకరణలతో ముస్తాబవుతున్నాయి.

- మహబూబాబాద్ (ఆంధ్రజ్యోతి)

వివరాలు 4లో..

రంజాన్ వేళలు	
ఇఫ్తార్ :	
సహర్ :	మంగళవారం ఉ: 5.05 గం..

కమలం చెంతకు సీతారాంనాయక్

- తరుణ్‌చుగ్ నుంచి బీజేపీ సభ్యత్వం స్వీకరణ



బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్న సీతారాంనాయక్

వరంగల్ క్రైం, మార్చి10 : బీఆర్‌ఎస్ మాజీ ఎంపీ సీతారాంనాయక్ ఆదివారం బీజేపీలో చేరారు. ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల పార్టీ ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ చేతుల మీదుగా సీతారాంనాయక్ బీజేపీ సభ్యత్వం తీసుకున్నారు. 2014లో బీఆర్‌ఎస్ నుంచి మహబూబాబాద్ ఎంపీగా సీతారాంనాయక్ పోటీచేసి విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో సీతారాంనాయక్‌ను కాదని, మాజీమంత్రి రెడ్యానాయక్ కూతురు కవితకు అవకాశం ఇచ్చారు. ఆ సమయంలో పలు హామీలు ఇచ్చిన బీఆర్‌ఎస్ అధిష్ఠానం సీతారాంనాయక్‌ను పట్టించుకోలేదు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికలకు సైతం కవితను పార్టీ అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో బీఆర్‌ఎస్ వైఖరిపై బాహాటంగానే అసంతృప్తిని వ్యక్తం చేసి పార్టీని వీడేందుకు సీతారాం నాయక్ సిద్ధమయ్యారు. ఈ క్రమంలో మూడురోజుల కిందట నగరానికి వచ్చిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. సీతారాంనాయక్ నివాసానికి వెళ్లి బీజేపీలోకి ఆహ్వానించారు. కేంద్ర మంత్రి ఆహ్వానం మేరకు ఆదివారం సీతారాంనాయక్ బీజేపీలో చేరారు. కాగా, సీతారాంనాయక్‌కు బీజేపీ అధిష్ఠానం మహబూబాబాద్ లోక్‌సభ టికెట్ హామీ ఇచ్చినట్లు సమాచారం.

ప్రశాంతంగా సైనిక్ గురుకుల ప్రవేశ పరీక్ష



ప్రవేశ పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 10 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక స్కూల్, జూనియర్ కళాశాలల్లో ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు సాంఘిక సంక్షేమ గురుకులాల ప్రాంతీయ సమన్వయ అధికారి ప్రత్యూష తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 182 మంది పరీక్షకు హాజరు కానుండగా 173 మంది హాజరైనట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం ఉద యం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటల వరకు నిర్వహించిన పరీక్షకు 74 మంది పరీక్షకు హాజరు కానుండగా 69 మంది హాజరైనట్లు ఆర్సీవో తెలిపారు.

పరీక్ష కేంద్రం ప్రధాన రహదారిపై ఆందోళన..

మానుకోట జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన సైనిక్ స్కూల్, జూనియర్ కళాశాల ప్రవేశపరీక్ష కేంద్రం విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ తనపై దురుసుగా ప్రవర్తించి చేయి చేసుకున్నాడని మానుకోట-కేసముద్రం ప్రధాన రహదారిపై విద్యార్థి తండ్రి కృష్ణ ఆందోళన చేపట్టారు. తన కుమారుడు పరీక్ష రాసేందుకు పరీక్ష కేంద్రంలోనికి పెన్నులు తీసుకోకుండా మరిచిపోయాడని నేను పెన్నులు ఇచ్చేందుకు ప్రయత్నించగా అక్కడ ఉన్న కానిస్టేబుల్ దురుసుగా ప్రవర్తించి తనపై చేయిచేసుకున్నాడని ఆరోపించారు. అందుకు నిరసనగా అక్కడ ఉన్న కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు సెంటర్ ఎదుట ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. తనపై చేయి చేసుకున్న కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆందోళనను విరమింపచేశారు.

సావిత్రిబాయి పూలె ఆశయాలను నెరవేర్చాలి

- బాలికా విద్యకు బాటలు వేసిన మహనీయురాలు
- టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కవిత

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 10 : విద్యావంతురాలైన తల్లి వందమంది ఉపాధ్యాయులతో సమానం అని, ఆదిశగా మహిళా అక్షరాస్యతకు కృషి చేసిన దేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలె ఆశయాలను నెరవేర్చాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి సిద్దోజు కవిత పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లోని సంఘం కార్యాలయం వద్ద ఆదివారం సావిత్రిబాయిపూలె వర్ధంతిని పురస్కరించుకొని, సావిత్రిబాయిపూలె విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం అధ్యక్షతన నిర్వహించిన మహిళా సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళ విద్యకోసమే కాకుండా సమానత్వాన్ని చాటి చెప్పిన దార్శనికురాలు సావిత్రిబాయి పూలె అని కొనియాడారు. దేశంలో బాలికా విద్యకుబాటలు వేసిన మహనీయురాలు అని, ఆమెస్ఫూర్తితో విద్యాభివృద్ధికి పాటుపడాలని కోరారు.

డీఈవో రామారావు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలె ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని సూచించారు. ఆనాడు సమాజంలో నెలకొని ఉన్న సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడారని పేర్కొన్నారు. అలాంటి మహానుభావుల విగ్రహాలు నెలకొల్పటం భవిష్యత్‌తరాలకు స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. విగ్రహాన్ని నెలకొల్పడమే కాకుండా వారి ఆశయ సాధనకు ఉపాధ్యాయలోకం పని చేయాలని సూచించారు.

సంఘం పూర్వరాష్ట్ర అధ్యక్షుడు కొండల్‌రెడ్డి మాట్లాడుతూ సామాజిక అసమానతలను రూపుమాపే అతిముఖ్యమైన సాధనాలలో విద్యప్రధానమైనదని పేర్కొన్నారు. ఆనాడు అగ్రవర్ణాలకే విద్య అందుబాటులో ఉండగా నేడు కొనుక్కునే వాడికే విద్య దొరుకుతుందని, ఈ అసమానతలను వ్యతిరేకిస్తూ కామన్ స్కూల్ విద్యావిధానం కోసం సంఘంపోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీ, ప్రజాసంఘాల నాయకులు సాదుల శ్రీనివాస్, విజయసారథి, జడ సత్యనారాయణ, బండారి ఐలయ్య, డాక్టర్ డోలి సత్యనారాయణ, దార్ల శివరాజ్, పిల్లి సుధాకర్, గుగ్గిళ్ల పీరయ్య ఇక్బాల్, సంఘం రాష్ట్ర కార్యదర్శి భోగేశ్వర్, జిల్లా నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, అజయ్ బాబు, పూర్ణచందర్, బాబురావు, నాగమణి, ఐలయ్య, బొల్లం శ్రీనువాస్, మహబూబ్ అలీ, బలాష్టి రమేష్, సువర్ణ, విష్ణువర్ధన్, చికటి ఉపేందర్, శ్రీనివాస్, సైదులుపాషా, సాంబయ్య, సాయిబాబా, సురేందర్‌గుప్తా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ టీపీటీఎఫ్ కార్యాలయం వద్ద సావిత్రిబాయి పూలె విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కవిత, పాల్గొన్న సంఘం నేతలు

వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో..

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సోమారపు వీరస్వామి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలె వర్ధంతిని నిర్వహించారు. అనంతరం యువ డాక్టర్లు వేమిశెట్టి సాహితి, క్రిష్ణజ, పి.లక్ష్మీవిశాల, తండా హరీష్‌గౌడ్‌తో పాటు మరో ముగ్గురు సామాజిక కార్యకర్తలను సన్మానించారు. సూర్నపుసోమయ్య, కొండ్ర ఎల్లయ్య, రేణుక, డాక్టర్ అంబాల అంబరీష, సదానందం, రామయ్య, వేణుమాధవ్, సూర్యప్రకాష్, రమా, గణేష్, ప్రసాద్, నాగమణి పాల్గొన్నారు.

కురవి జాతర ఆదాయం రూ. 3 లక్షలు

- మానుకోట ఆర్టీసీ డీఎం శివప్రసాద్

మహబూబాబాద్ టౌన్, మార్చి 10 : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 8న మానుకోట నుంచి కురవి జాతరకు నడిపించిన బస్సుల ద్వారా రూ.3,01,000 ఆదాయం వచ్చిందని స్థానికడిపో మేనేజర్ ఎం. శివప్రసాద్ ఆదివారం ఒకప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ డిపో నుంచి 17 ప్రత్యేక బస్సుల ద్వారా 176 ట్రిప్పులు 5056 కిలోమీటర్లు తిప్పి 102 ఓఆర్‌తో 59.53 ఈపీకే సాధించి రూ.3,01,000 ఆదాయం సాధించినట్లు వివరించారు. గత సంవత్సరం 2023లో మహాశివరాత్రి రోజున 11 బస్సులతో 111 ట్రిప్పులు 2964 కిలోమీటర్లు తిప్పి రూ.1,58,018 ఆదాయం సాధించినట్లు పేర్కొన్నారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఆదాయం దాదాపు రెట్టింపు అయ్యిందని చెప్పారు. ఆర్టీసీ బస్సులను ఆదరించిన భక్తులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కురవి జాతరకు విజయవంతంగా బస్సులను నడిపి సురక్షితంగా భక్తులను జాతరకు తరలించిన ఆర్టీసీ సిబ్బందికి డీఎం కృతజ్ఞతలు తెలిపారు.

నేడు వీరభద్రస్వామి తెప్పోత్సవం

కురవి : కురవి శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం తెప్పోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణ అధికారి సత్యనారాయణ తెలిపారు. కురవి పెద్దచెరువులో కల్యాణ వీరభద్రుడు, భద్రకాళి మాతల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా ఆలంకరించిన పడవలో ఊరేగించనున్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు హాజరుకావాలని కోరారు.

అయ్యో.. ఆడపిల్లలు!

- అనుమానాస్పద స్థితిలో ఇద్దరు చిన్నారుల మృతి
- తల్లిదండ్రులే చంపినట్లు అనుమానాలు?
- కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు
- అంకన్నగూడెంలో ఘటన





గార్ల మండలం అంకన్నగూడెంలో చనిపోయిన చిన్నారులు

గార్ల, మార్చి 10 : అనుమానాస్పద స్థితిలో ఇద్దరు ఆడపిల్లలు మృతి చెందారు. ఈ ఘటన సీతంపేట గ్రామపంచాయతీ అంకన్నగూడెంలో ఆదివారం చోటు చేసుకొంది. గార్ల, బయ్యారం సీఐ రవికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

అంకన్నగూడెం గ్రామానికి చెందిన పెండగట్ల అనిల్ బయ్యారం మండలం నామాలపాడు చెందిన దేవిని ఐదేళ్ల కిందట ప్రేమవివాహం చేసుకున్నాడు. ఆ దంపతులకు లాస్య (3 ఏళ్లు), జశ్విత (11 నెలలు) సంతానం. అనిల్ గ్రామంలోనే ఓ ఆసామి వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తుండగా, భార్య కూలి పనులు చేస్తోంది. శనివారం రాత్రి యథావిధిగా పిల్లలతో కలిసి భోజనం చేసి పిల్లలతో పాటు దంపతులు పడుకున్నారు. ఆదివారం తెల్లవారేసరికి మంచంపై విగతజీవులుగా పిల్లలు కనిపించారు. అయితే ఆ దంపతులిద్దరూ తెల్లవారుజామున ఇంటికి తాళం వేసి ఎవరికి చెప్పకుండానే వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం కొడుకు, కోడలు, మనవరాళ్లు కనిపించకపోవడంతో పక్కనే మరో ఇంట్లో ఉండే అనిల్ తండ్రి వెంకన్న కిటికీ నుంచి చూశారు. ఇద్దరు మనవరాళ్లు మంచంపై విగతజీవులుగా కన్పించారు. ఈ విషయాన్ని చుట్టుపక్కల ఇళ్లవారికి తెలియజేసి, పోలీసులకు సమాచారం అందించారు.

సీఐ బి.రవికుమార్, గార్ల ఎస్సై జీనత్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని మంచంపై ఉన్న పాలడబ్బాను, పరిసరాల్లో ఉన్న పురుగుల మందుడబ్బాను స్వాధీనం చేసుకున్నారు. అనుమానాస్పద మృతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రవికుమార్ తెలిపారు. తల్లిదండ్రులు పరారీలో ఉండడంతో వరుసగా ఇద్దరు ఆడపిల్లలే పుట్టడంతో పాలల్లో పురుగుల మందు కలిపి తాగించి చంపి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

బినామీ సభ్యులకు చెక్





- ఒక్కక్లిక్‌తో మహిళా సంఘాల వివరాలు
- లోకోస్ యాప్‌లో పూర్తి సమాచారం
- నమోదు చేస్తున్న ఐకేపీ అధికారులు
- నగదు రహిత లావాదేవిలపై దృష్టి

తొర్రూరు, మార్చి10 : మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతమై నిలదొక్కుకునేందుకు ప్రభుత్వాలు వారికి పలు సం క్షేమ పథకాలను అందిస్తుంది. ఈ స్కామ్‌ల అమలులో ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సరికొత్త విధానం తీసుకువచ్చింది. కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో లోకోస్ యాప్‌ను ప్రవేశపెట్టింది. స్వయం సహాయక సంఘాలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారు. ఇచ్చిన రుణంతో వ్యాపారాలు చేస్తూ కుటుంబానికి భరోసా ఇస్తున్నారు. దీంతో జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ (నేషనల్ రూరల్ లైవ్‌లీ వుడ్ మిషన్) ఆధ్వర్యంలో ప్రతీ సభ్యురాలి బ్యాంకు ఖాతాను ఆధార్‌కు అనుసంధానం చేయాలని నిర్ణయించింది. పొదుపు రుణాల లావాదేవీలను యాప్‌లో పొందుపర్చాలని ఆదేశాలు జారీచేశారు. దీంతో మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో లోకోస్ యాప్‌పై డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

జిల్లాలో 15వేల సంఘాలు..

జిల్లాలోని 18 మండలాల పరిధిలో సుమారు 15వేల సంఘాలు ఉన్నాయి. వాటిల్లో సుమారు లక్ష 50వేల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వారి కోసం 680 మంది గ్రామ దీపికలు విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా సభ్యులందరి ఆధార్, బ్యాంక్ లింకేజీ, తీసుకున్న రుణాలు, తదితర వివరాలను గ్రామైక్య సంఘాల నుంచి సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. మహిళా సం ఘాలు తీసుకున్న రుణాలు, చెల్లించిన వడ్డీ ఇతర వివరాలు పారదర్శకత కోసం లోకో యాప్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. ఈ వివరాలను తెలుసుకునేందుకు యాప్ ఎంతో సులువుగా ఉంటుంది. ఈ వివరాలను జిల్లా వ్యాప్తంగా డీఆర్‌డీఏ డీపీఎం శ్రీనివాస్ పర్యవేక్షిస్తున్నారు.

నగదు రహిత లావాదేవిలు..

ప్రతీ మహిళ నగదు రహిత లావాదేవిలు నిర్వహించేలా చర్యలు చేపడుతున్నారు. దీనిపై ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పిస్తున్నారు. 'ఆన్‌లైన్'లో పొందే సేవలు, ఇతర విషయాలపై మహిళా సంఘాలకు వివరిస్తూ బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానించే ప్రక్రియ కొనసాగుతుందని, దీని ద్వారా సేవలు పారదర్శకంగా అందుతాయని అధికారులు చెపుతున్నారు.

బినామీ సభ్యులకు చెక్

లోకోస్ యాప్‌లో వివరాలు పొందు పర్చడం ద్వారా బినామీ సభ్యులకు చెక్ పడనుంది. బోగస్ సంఘాలు లేకుండా ఉండటంతో పాటు మహిళలు రెండుచోట్ల సంఘాల్లో సభ్యులుకాకుండా వివరాలు కనిపిస్తాయి. వాస్తవంగా ఎవరైతే రుణం తీసుకుని సక్రమంగా చెల్లించి ఆర్థికంగా బలోపేతం అవుతున్నారో వారి వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి. ఒకే మహిళ రెండు సంఘాల్లో సభ్యురాలిగా ఉంటూ రుణం తీసుకుంటే వెంటనే గుర్తించే అవకాశం ఉంటుంది.

లోకోస్ యాప్‌లో నమోదు చేస్తాం

- డీపీఎం జి.శ్రీనివాస్

గ్రామైక్య సంఘాల వివరాలను లోకోస్ యాప్‌లో నమోదు చేస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్నిసంఘాల వీఏవోలకు అవగాహన కల్పిస్తాం. బ్యాంకు లింకేజిపై అప్రమత్తంగా ఉంటూ గ్రామ దీపికలతో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మహిళా సంఘాల బలోపేతానికి అన్ని విధాలుగా అవగాహన కల్పిస్తాం.

50 కిలోల గంజాయి పట్టివేత

వరంగల్ క్రైం, మార్చి 10: హనుమకొండ హంటర్‌రోడ్డులో 50 కిలోల గంజాయి పట్టుకున్నట్లు సమాచారం. ఆదివారం ఒరిస్సా నుంచి పూణెకు ఇద్దరు వ్యక్తులు గంజాయితో వెళుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు.. పట్టుకునేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న ఇద్దరు వ్యక్తులు వరంగల్ స్టేషన్‌లో దిగి రోడ్డు మార్గాన కాజీపేటకు బయలు దేరినట్లు సమాచారం. గంజాయితో వెళుతున్న ఇద్దరు వ్యక్తులను అనుసరించిన పోలీసులు.. హంటర్‌రోడ్డులోని ఒక మార్ట్ వద్ద పట్టుకున్నట్లు అధికారిక సమాచారం. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారి నుంచి 50కేజీల గంజాయి పట్టుకున్నట్లు తెలిసింది. పోలీసులు అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది.

చైన్ స్నాచింగ్

కరీంనగర్ జిల్లా కండ్లపల్లి గ్రామానికి చెందిన స్వప్న అనే మహిళ పదిరోజుల కిందట కరీంనగర్ వెళ్లేందుకు హనుమకొండ బస్టాండ్‌లో వేచి ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు మెడలోని మూడు తులాల గొలుసును అపహరించుకువెళ్లారు. బాధితురాలు ఆదివారం ఫిర్యాదు చేయగా హనుమకొండ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.



రేపటి నుంచే పవిత్ర ఉపవాస దీక్షలు ప్రారంభం ● నేటి నెలవంక దర్శనం కోసం ఎదురుచూపులు

మహబూబాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఏటేటా మాసం తగ్గుతూ వివిధ రుతువులను సృషిస్తూ వచ్చే రంజాన్ మాసం.. ఈ సారి మండుటెండలు దంచి కొడుతున్న మార్చి రెండో వారంలో ఆరంభమవుతోంది. అయినా అంతా అల్లాహ్‌పై భారం వేసుకుని లాలజాన్ని సైతం మింగకుండా కఠోర దీక్షతో సూర్యోదయానికి ముందే ఆరంభించే నెలరోజుల ఉపవాసదీక్షలకు అంతా సన్నద్ధమయ్యారు.

కఠోర ఉపవాస దీక్షలు

ముస్లిం సోదరులు వయో, లింగభేదాలు లేకుండా పాటించే రంజాన్ మాసంలోని కఠోర ఉపవాస దీక్షల వెనుక ఆరోగ్యసూత్రాలు దాగి ఉన్నాయి. సూర్యోదయానికి ముందే తెల్లవారు జామున నిర్ణీత వేళ రంజాన్ క్యాలెండర్ ప్రకారం సహర్ సమయాన భోజనం ముగించుకుని అప్పట్నుంచే ఉపవాస దీక్షలు ప్రారంభిస్తారు. తిరిగి సూర్యాస్తమయం అయ్యాక సాయంత్రం ఇఫ్తార్‌తో దీక్షను డ్రైఫ్రూట్ లేదా పండ్లు, ఫలాలతో విరమిస్తారు. తర్వాత యథావిధిగా భోజనం తీసుకుంటారు. ఏటా రంజాన్ మాసం ఆరంభం ఒకనెల ముందుగా వస్తూ ఉంటుంది. దీక్షా సమయంలో కఠోర నియమాలు పాటించడంతో పాటు ప్రతిరోజు నిత్యం ఐదు సార్లు నమాజ్ చేయడం అనవాయితీగా కొనసాగిస్తారు. ప్రతీ సెకను కూడా అల్లాహ్ నామస్మరణతో తమ విధుల నిర్వహణల్లో నిమగ్నమవుతారు. చంద్రదర్శనాన్ని బట్టి ఈ మాసం 29 లేక 30 రోజుల పాటు కొనసాగుతుంది.

రంజాన్‌లో మనోనిగ్రహం

రంజాన్ పండుగ మాసానికి వెనుక విశిష్ట ప్రాధాన్యత ఉంది. 'రమ్జ్' అంటే అరబిక్ భాషలో 'కాలడం' అని అర్థంగా పెద్దలు విశ్లేషిస్తారు. ఈ నెలరోజుల ఉపవాస దీక్షలో శరీరాన్ని సుష్కింపచేయడం ద్వారా ఆత్మ ప్రక్షాళనతో సర్వపాపాలు సమసిపోతాయని ముస్లింల విశ్వాసం. ఆ క్రమంలోనే అరిషడ్వర్గాలైన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్స ర్యాలు అదుపులో ఉంటాయని.. దీనికి తోడు మనోనిగ్రహం కలుగుతుందని విశ్వసిస్తారు. ఉపవాస దీక్ష 'రోజా'ను అరబిక్ భాషలో 'సౌమ్', 'సియామ్' అని అంటారు. సౌమ్ అంటే మానుకొనుట, ఆపుట, ఆగుట, కట్టుబడి ఉండుట అనే అర్థాలు వస్తాయి. ఉపవాసిని 'సాయమ్' అని అంటారు. ఇస్లామియా పరిభాషలో ప్రభాత పూర్వసమయం నుంచి సూర్యాస్తమయం వరకు అన్నపానీయాలు త్యజించడం ఈ ఉపవాస దీక్షకు పరమార్థంగా పేర్కొంటారు. ప్రవక్త హజ్రత్ మహ్మద్ ఖర్జూరం పళ్లతోనే ఉపవాస దీక్ష విరమించేవారని విశ్వసించే ముస్లింలు రంజాన్‌లో ఆచరిస్తారు. దివ్య ఖుర్‌ఆన్ అవతరించిన ఈ మాసంలోనే హజ్రత్ దావూద్ అలైకు జబూర్ గ్రంథం, హజ్రత్ మూసా అలైకు తౌరాత్ గ్రంథం, హజ్రత్ ఈసా అలైకు బైబిల్ గ్రంథం ప్రసాదించబడిందని నమ్ముతారు.



రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రతి గ్రామంలోనూ రెవెన్యూ ఉద్యోగి ఉండేలా చర్యలు చేపట్టాలి

సీఎంను కోరిన డిప్యూటీ కలెక్టర్ల, రాష్ట్ర తహసీల్దార్ల అసోసియేషన్లు

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థలను బలోపేతం చేయాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని డిప్యూటీ కలెక్టర్ల, రాష్ట్ర తహసీల్దార్ల అసోసియేషన్ల సభ్యులు కోరారు. ఆదివారం డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె. రామకృష్ణ, ఎస్.ఆర్ సరిత, తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రాములు, రమేశ్ పాక, అసోసియేట్ ప్రెసిడెంట్ పూల్‌సింగ్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు, పూర్వ వీఆర్‌ఓ, వీఆర్‌ఏల పెండింగ్ సమస్యలు, తహసీల్దార్ల అద్దె వాహనాలకు బిల్లుల చెల్లింపు, క్యాడర్ బలోపేతం, తదితర అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత రెవెన్యూ డివిజన్లు, మండలాలు పెరిగినా.. రెవెన్యూ ఉద్యోగుల సంఖ్య పెరగలేదని చెప్పారు. దీంతో ఉన్న ఉద్యోగుల మీదనే పని భారం పడుతోందని, జిల్లాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్లకు అనుగుణంగా క్యాడర్‌ను పెంచాలని సీఎంను కోరారు. ప్రతి గ్రామంలోనూ రెవెన్యూ ఉద్యోగి ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. జీఏడీ పరిధిలోని అదనపు కలెక్టర్ల పోస్టుల వ్యవహారాన్ని రెవెన్యూ విభాగ పరిధిలోకి తేవాలని విజ్ఞప్తి చేశారు. అన్ని అంశాలపై సీఎం సానుకూలంగా స్పందించినట్టు అసోసియేషన్ల ప్రతినిధులు తెలిపారు.

నేటి నుంచి లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలు

- తొలిరోజు పూజల్లో పాల్గొననున్న సీఎం
- పట్టు వస్త్రాలు, తలంబ్రాల సమర్పణ



లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో విద్యుద్దీపాల వెలుగులు

యాదగిరిగుట్ట, మార్చి 10: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. సోమవారం ఉదయం 10గంటలకు ప్రధానాలయ ముఖ మండపంలో అర్చక, వేదపండితుల బృందం సంప్రదాయరీతిలో లక్ష్మీనృసింహుల తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. తొలిరోజు వైదిక పూజల్లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనున్నారు. ఆయన సోమవారం ఉదయం 9గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి కాన్వాయ్‌లో కొండపైకి చేరుకుని వీఐపీ అతిథి గృహంలో కాసేపు విశ్రాంతి తీసుకుంటారు. 9.30గంటలకు ప్రధానాలయంలో స్వయంభువులను దర్శించుకుంటారు. స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవస్థాన అధికారులకు అందజేస్తారు. ఉదయం 11గంటలకు రేవంత్ హెలికాప్టర్‌లో భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయానికి బయల్దేరివెళతారు. సీఎం రేవంత్ పర్యటన నేపథ్యంలో కొండ కింద పాత గోశాల ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న హెలీప్యాడ్ వద్ద పనులను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆదివారం పరిశీలించారు. బ్రహ్మోత్సవాల తొలిరోజు పూజల్లో సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి, పలువురు మంత్రులు పాల్గొంటారని అధికారులు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఈసారి రూ.1.60కోట్లు కేటాయించామని, అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో రామకృష్ణారావు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 18న జరిగే తిరుకల్యాణోత్సవంలో భక్తులు పాల్గొనే విధంగా 600 టికెట్లను విక్రయిస్తామని, ఒక్కో టికెట్ ధర రూ.3వేలని తెలిపారు. కాగా, బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 17న రాత్రి ఎదుర్కోలు, 18న రాత్రి తిరుకల్యాణోత్సవం, 19న రాత్రి దివ్య విమాన రథోత్సవ ఘట్టాలను నిర్వహిస్తారు. ఈ నెల 20న మహాపూర్ణాహుతి, చక్రతీర్థ స్నానం ఉంటుంది. 21వ తేదీన అష్టోత్తర శతఘటాభిషేకం, పండిత సన్మానంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయి.

లోకం తీరు



ఉద్యోగులకు ఏడో గ్యారెంటీ!

(మొదటి పేజీ తరువాయి)



ఇస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల డీఏ, పీఆర్సీపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆదివారం ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ఎంసీహెచ్‌ఆర్డీలో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇన్ని రోజులూ ఆయా ప్రభుత్వ ఉద్యోగ సంఘాలకు గౌరవ అధ్యక్షులుగా ఉన్నది కేసీఆర్ కుటుంబమేనన్నారు. నిర్బంధాలతో పాలన సాగిస్తామనుకోవడం వారి భ్రమ అని, సమస్యలకు చర్చలే పరిష్కారం తప్ప.. నిర్బంధాలు కావని అన్నారు. ప్రభుత్వంపై ఉద్యోగులకు విశ్వాసం కల్పించడానికే చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించామని గుర్తు చేశారు. మంత్రివర్గ ఉపసంఘం శాఖల వారీగా సమావేశం నిర్వహించి నిర్ణయాలు తీసుకుంటుందని, సంఘాలతో చర్చించకుండా నిర్ణయాలు తీసుకోబోమని స్పష్టం చేశారు. ఉద్యోగుల డీఏతో పాటు ఇతర అంశాలపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని, వివిధ శాఖల్లో ఉన్న 1100 మంది రిటైర్డ్ ఉద్యోగుల కొనసాగింపుపైనా త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలకు ఉచితంగా విద్యుత్తు ఇచ్చే విషయంలోనూ క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కిందిస్థాయి సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. ఉద్యోగులకు ఒకటో తారీకునే జీతాలు వేసినా తాము ప్రచారం చేసుకోవడం లేదన్నారు. రోజుకు 18 గంటలు పనిచేస్తూ పాలనను గాడిలో పెడుతున్నామని చెప్పారు.

తెలంగాణ బాపు కేసీఆర్ కాదు..

మాజీ సీఎం కేసీఆర్ తనకు తాను తెలంగాణ బాపుగా చెప్పుకొంటున్నారని, అలా చెప్పుకోవడానికి కనీస పోలిక ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ బాపు, సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ అని, తెలంగాణ ఆత్మను గౌరవించకపోతే సమాజం మనల్ని క్షమించదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఆదాయం పడిపోతే.. మద్యంపై వచ్చే ఆదాయంపైనే ఆధారపడేలా కేసీఆర్ పాలన సాగిందని విమర్శించారు. విద్యార్థి, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని రేవంత్ అన్నారు. రక్తం చిందించకుండా తెలంగాణ సాధించామని కేసీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడారని విమర్శించారు. కేసీఆర్ కుటుంబంలో ఎవరి రక్తమూ చిందలేదని, కానీ.. కానిస్టేబుల్ కిష్టయ్య లాంటివారు రక్తాన్ని చిందించారని, శ్రీకాంతాచారి లాంటివారు మాంసపు ముద్దలయ్యారని అన్నారు. టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్‌ను శాసన మండలికి తప్పక పంపుతామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆయన ఎమ్మెల్సీగా ఉంటే శాసనమండలికి గౌరవమన్నారు. ఈ విషయంపై గవర్నర్ తమిళిసైతో మాట్లాడతానన్నారు. ఈ సమావేశంలో మంత్రి డి.శ్రీధర్‌బాబు, కోదండరామ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

టీచర్లు, ఉద్యోగులలో సంతోషం..

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో పదేళ్ల తర్వాత ముఖ్యమంత్రి ముఖాముఖి సమావేశం కావడం పట్ల ఆయా సంఘాలు సంతోషం వ్యక్తం చేశాయి. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ప్రత్యేక చొరవతో ఏర్పాటైన ఈ సమావేశంలో.. ప్రధాన డిమాండ్లను సీఎం దృష్టికి టీజీవోఏ తీసుకెళ్లింది. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏల్లో మూడింటిని ఇవ్వాలని, సీపీఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరింది. వీటితోపాటు పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న హెల్త్ కార్డులను వెంటనే ఇవ్వాలని, పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని విన్నవించింది. కాగా, ముఖ్యమంత్రి రెండు గంటలపాటు తమ సమస్యలపై మాట్లాడమే కాకుండా ఎంతో ఓపికగా విన్నారని సంఘాల నేతలు తెలిపారు. గతంలో కనీసం సమస్యలు వినే పరిస్థితి కూడా ఉండేది కాదన్నారు. కాగా, వైద్యశాఖలో పని చేస్తున్న మెడికల్ సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ అందరినీ బదిలీ చేయాలని మెడికల్ జేఏసీ.. ముఖ్యమంత్రిని కోరింది. ఉస్మానియాకు కొత్త భవనం కట్టాలని, అశాస్త్రీయంగా ఉన్న మెడికల్ కాలేజీల సంఖ్యను తగ్గించాలని సూచించింది. ఆస్పత్రుల్లో విధులకు వచ్చే నర్సులు దుస్తులు మార్చుకునేందుకు కనీసం రూమ్‌లు లేని విషయాన్ని నర్సుల అసోసియేషన్ సీఎం దృష్టికి తీసుకెళ్లింది. ఇక సాధారణ బదిలీలు, పదోన్నతులు, 317 సమస్యను పరిష్కరించాలని, ఉపాధ్యాయ, ఉద్యోగుల సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ పునరుద్ధరణపై ఆయా సంఘాల ప్రతినిధులు సీఎంకు వినతి పత్రం ఇచ్చారు. ప్రధానంగా టీచర్లకు సంబంధించిన మల్టీజోన్, స్పౌజ్ సమస్యలు, స్థానికత, బదిలీలు, ఆరోగ్య బీమా, పెండింగ్ డీఏ లాంటి సమస్యలను వివరించారు. కాగా వినతి పత్రాలను కొన్నింటిని సీఎం నేరుగా తీసుకున్నారు.

సీఎంకు పీఆర్‌టీయూ నేతల కృతజ్ఞతలు

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించడమే కాకుండా సమస్యల్ని త్వరలోనే పరిష్కరిస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడం పట్ల పీఆర్‌టీయూ నేతలు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, కమలాకర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

అధికారంలోకి వచ్చిన 72 రోజులకే

31వేల ఉద్యోగాలిచ్చాం

మరో గ్యారెంటీకి శ్రీకారం: పొంగులేటి

మాటిస్తే కాంగ్రెస్ మడమ తిప్పదు: సురేఖ

జీవో 3పై కవిత వ్యాఖ్య విడ్డూరం: సీతక్క

వరంగల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తాము అధికారంలోకి వచ్చిన 72 రోజుల్లోనే 32వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి, యుద్ధప్రతిపాదికన ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం నిరుద్యోగ యువత ఉసురు తీసుకుందని, తాము 11,600 టీచర్ ఉద్యోగాల భర్తీకి మెగా డీఎస్సీ కోసం నోటిఫికేషన్ ఇచ్చామని పేర్కొన్నారు. ఆదివారం హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీలో రూ.68 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు, వరంగల్ నగరంలో రూ.280.85 కోట్లతో చేపట్టిన పనులకు మంత్రులు కొండా సురేఖ, సీతక్కతో కలిసి ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే నాలుగు పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. అర్హులైన పేదలందరికీ సొంతింటి కలను సాకారం చేస్తామని తెలిపారు. ఒకటో తేదీ నుంచి మూడో తేదీలోపు ఉద్యోగులకు వేతనాలు ఇస్తున్న ప్రభుత్వం తమదని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట తప్పదని మంత్రి కొండా సురేఖ అన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, అందులో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ నగరానికి రూ.260కోట్ల నిధులు కేటాయించారని తెలిపారు. జీవో నంబరు 3కు వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత మాట్లాడడం విడ్డూరమని, అసలు ఆ జీవో ఇచ్చిందే కేసీఆర్ ప్రభుత్వమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తప్పుడు ప్రచారాలు బంద్ చేసి, నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించాలని సూచించారు.

భట్టి నాకు ద్రోహం చేస్తున్నారు

- ఖమ్మం టికెట్‌ను అడ్డుకుంటున్నారు: వీహెచ్

న్యూఢిల్లీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తనకు ద్రోహం చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ హనుమంతరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఖమ్మం లోక్‌సభ సీటు తనకు రాకుండా భట్టి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఆదివారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో విలేకరుల సమావేశంలో వీహెచ్ మాట్లాడారు. 'భట్టిని అప్పట్లో ఎమ్మెల్సీని చేయడంలో నాదే కీలక పాత్ర.. భట్టి ఈరోజు పార్టీలో ఈస్థానంలో ఉండడానికి కారణం నేనే.. 2019 వరకు ఖమ్మంలో ప్రతి కార్యక్రమానికి ఆయన నన్ను రమ్మన్నారు.. ఆ తర్వాత పిలవడం మానేశారు. పనిచేసినోడికి ముఖ్యమంత్రి పదవి రావాలని నేను అన్నందుకే నాపై కక్ష కట్టారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ పార్టీ కోసం చాలా కష్టపడ్డారని చెప్పారు. 'రాహుల్‌ఖమ్మం నుంచి పోటీ చేస్తే నేను తప్పుకుంటా.. లేదంటే ఆ సీటుకు నేను అన్నివిధాల అర్హుడిని.. ఖమ్మం టికెట్ ఇస్తే భారీ మెజారిటీతో గెలుస్తా.. పదవి ఉన్నా లేకపోయినా చనిపోయేవరకు కాంగ్రెస్‌లోనే ఉంటా.. చనిపోయిన తర్వాత పార్టీ జెండా నాపై ఉంటుంది' అని వ్యాఖ్యానించారు.

వీహెచ్‌కు ఖమ్మం టికెటిస్తే కలిసికట్టుగా గెలిపిస్తాం

- నేను అడ్డుపడడం..ఆయన అపోహే: భట్టి

చింతకాని, మార్చి 10: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికలో కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీదే తుది నిర్ణయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆ కమిటీ నిర్ణయం మేరకే అభ్యర్థుల ఎంపిక ఉంటుదని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో పర్యటించిన భట్టి.. ఎంపీ టికెట్ల కేటాయింపు విషయమై పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. పార్టీ అధిష్ఠానం వీహెచ్‌కు ఖమ్మం ఎంపీ టికెట్ ఇస్తే జిల్లా మంత్రులు, నాయకులు, కార్యకర్తలు.. అందరం కలసికట్టుగా పనిచేసి గెలిపించుకుంటామని చెప్పారు. ఖమ్మం ఎంపీ టికెట్ వీహెచ్‌కు రాకుండా తాను అడ్డుపడటం లేదని.. అది కేవలం ఆయన అపోహ మాత్రమేనన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడిగా వీహెచ్‌కు తన పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుతో పాటు రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తమ తక్షణ కర్తవ్యమన్నారు. లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక విషయంలో అధిష్ఠానం నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉంటామని తెలిపారు.

మాకు న్యాయం చేయండి

- 317 జీవో వల్ల బాధితులుగా మారాం
- మంత్రి దామోదరను కలిసిన నర్సులు

గత సర్కారు హయాంలో విడుదల చేసిన జీవో నంబరు 317 వల్ల తాము బాధితులుగా మారామని, తమకు న్యాయం చేయాలని కోరుతూ నర్సులు వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఆదివారం ఆయన నివాసంలో కలిశారు. తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వం నిరంకుశంగా జోనల్ వ్యవస్థను తీసుకొచ్చి తమ జీవితాలతో చెలగాటం ఆడుకుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 317జీవోపై క్యాబినెట్ సబ్ కమిటీలో చర్చించి, అందరికీ న్యాయం చేస్తామని మంత్రి ఉద్యోగులకు భరోసానిచ్చారు.

పేదింటి పండుగ

నేడు 'ఇందిరమ్మ ఇల్లు' పథకం ప్రారంభించనున్న సీఎం రేవంత్



హైదరాబాద్, ఖమ్మం/భద్రాచలం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పేదవాడి సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. "ఇందిరమ్మ ఇల్లు" పథకం కార్యరూపం దాల్చనుంది. రాముల వారు కొలువైన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం భద్రాచలంలో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ ప్రాంగణం దీనికి వేదిక కానుంది. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఇందిరమ్మ ఇల్లు ఐదోది. అధికారంలోకి వచ్చాక మూడు నెలల్లో నాలుగు పథకాలను అమలు చేసింది. కాగా, ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించి మూడు నమూనాలను కూడా సోమవారం ప్రకటించనున్నారు. పథకం అమలుకు అవసరమైన మార్గదర్శకాలను సర్కారు సిద్ధం చేసింది. ఇల్లు లేని అర్హులైన పేదలందరికీ దశలవారీగా వర్తింపజేయనున్నారు. స్థలం ఉన్నవారికి రూ.5 లక్షలు, లేనివారికి స్థలం ఇచ్చి రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేయనున్నారు. ఈ మొత్తాన్ని నాలుగు దశల్లో మంజూరు చేస్తారు. ఈ ఏడాదిలో నియోజకవర్గానికి 3,500 చొప్పున 119 నియోజకవర్గాలకు 4,16,500 ఇళ్లను మంజూరు చేయగా.. రిజర్వ్ కోటా (సీఎం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పరిధి)లో మరో 33,500 కేటాయించారు. మొత్తంగా 4.50లక్షల ఇళ్లు మంజూరు కానున్నాయి. తొలి దశలో సొంత స్థలం ఉన్నవారికి అందనుండగా.. స్థలం లేనివారికి రెండో దశలో పథకాన్ని వర్తింపజేస్తారు. ఇంటి నిర్మాణం విషయంలో లబ్ధిదారుదే పూర్తి నిర్ణయం అయినప్పటికీ.. ఆర్‌సీసీ స్ట్రక్చర్‌తో పాటు కచ్చితంగా వంట గది, బాత్‌రూమ్ ఉండాలి. అనంతరం 'ఇందిరమ్మ ఇల్లు' పథకం కింద నిర్మించినదని తెలిసేలా 'అభయహస్తం' లేదా ప్రత్యేకంగా తయారు చేసే కొత్త లోగోను ఉంచనున్నారు. కాగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాల విషయంలో చేసిన తప్పులు ఈసారి జరగకుండా, అర్హులకే పథకం అందేలా మార్గదర్శకాలను ఖరారు చేశారు. ఈ పథకానికి అర్హులైన వారు దాదాపు 30-40 లక్షలమంది ఉండొచ్చని ప్రభుత్వం అంచనా వేస్తోంది. 'ప్రజాపాలన' దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తయ్యాక హెచ్చుతగ్గులు ఉండొచ్చని కూడా భావిస్తోంది. దరఖాస్తులన్నింటినీ క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు అవసరమైతే గ్రామసభల్లోనూ మరోసారి పరిశీలించనున్నారు. గ్రామ సభల్లో వివరాలను నమోదు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఒక ప్రొఫార్మాను రూపొందించింది.

పథకం కోసం రుణం..

ఇందిరమ్మ ఇల్లు పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం హడ్కో నుంచి రూ.3 వేల కోట్ల రుణం తీసుకోనుంది. ఎన్ని ఇళ్లను ఏయే దశల్లో నిర్మిస్తామనే వివరాలను కూడా తెలిపింది. తొలి శలో గ్రామీణ ప్రాంతాల్లో 57,141, పట్టణాల్లో 38,094 ఇళ్లను నిర్మిస్తామని పేర్కొంటూ ఈ నె 5న జీవో విడుదల చేసింది. దీని ప్రకారం నియోజకవర్గానికి 800 ఇళ్లు అందనున్నట్టు తెలుస్తోంది. ఈ గణాంకాలు, అంచనాలు హడ్కో రుణం కోసం సంబంధించినవేనని సమాచారం. వీటికి మరికొన్ని కలిపి ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయనుంది. 'ఇందిరమ్మ ఇల్లు' పథకాన్ని మహిళ పేరు మీద అందిస్తారు. ప్రత్యేక పోర్టల్ ద్వారా నిర్మాణాలను పర్యవేక్షిస్తారు. లబ్ధిదారుకి రేషన్ కార్డు కచ్చితంగా ఉండాలి. గతంలో ఇందిరమ్మ ఇల్లు పొంది ఉంటే అనర్హులు. మంజూరైన ఇళ్ల కంటే లబ్ధిదారులు ఎక్కువ ఉంటే.. వారికి మరో విడతలో అందిస్తారు.

సీఎం భద్రాచలం పర్యటన షెడ్యూల్ ఇది..

సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం 12:10 గంటలకు భద్రాచలం రాముడిని దర్శించుకోనున్నారు. 1:30కు వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటుచేసిన సభలో 'ఇందిరమ్మ ఇల్లు' పథకాన్ని ప్రారంభిస్తారు. 2:30 నుంచి 3:30 మధ్య భద్రాచలం ఆలయం, సాగునీటి, దేవాదాయ శాఖ అధికారులతో సమావేశమై సీతారామ, సీతమ్మసాగర్ ప్రాజెక్టుల పనుల పురోగతిపై సమీక్షిస్తారు. సాయంత్రం 4 గంటలకు మణుగూరులో సభకు హాజరవుతారు. 6:10 గంటలకు హైదరాబాద్‌కు తిరిగి చేరుకుంటారు.

భద్రాచలం రామాలయం అభివృద్ధిపై ఆశ

హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా భద్రాచలం వచ్చిన రేవంత్.. అధికారంలోకి వస్తే ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం హోదాలో ఇప్పుడు భద్రాద్రి అభివద్ధికి వరాలు ప్రకటిస్తారని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం భద్రాచలం అభివృద్ధికి రూ.100కోట్లు ప్రకటించినా రూపాయీ ఇవ్వలేదు.

అప్పుల రాష్ట్రాన్ని అప్పగించినా హామీలు నెరవేరుస్తున్నాం: తుమ్మల



ఖమ్మంకార్పొరేషన్: ప్రజల సొమ్ము దోచుకోవటమే ధ్యేయంగా పనిచేసిన గత ప్రభుత్వం తమకు అప్పుల రాష్ట్రాన్ని అప్పగించినా సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో సాహసంతో ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా బూడిదెంపాడు వద్ద రూ.38.50 కోట్లతో ఖమ్మం-ఇల్లెందు రెండులైన్ల రహదారి నాలుగులైన్లుగా విస్తరణ, అభివృద్ధి పనులకు ఆదివారం మంత్రి శంకుస్థాపన చేశారు. సోమవారం భద్రాద్రి రాముడి సన్నిధిలో సీఎం రేవంత్‌రెడ్డి ఐదో గ్యారెంటీగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తారన్నారు. శ్రీశైలం, సాగర్‌లో నీళ్లు లేకపోవడానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వ తప్పిదాలే కారణమన్నారు.

బడుల్లో మార్పు రావాల్సిందే!

- మౌలిక సదుపాయాలు కల్పించండి
- సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పూర్తి చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో స్పష్టమైన మార్పు కనిపించాలని.. వాటిపై ప్రజలకు నమ్మకం కలిగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్కారీ బడులు, కళాశాలలకు తక్షణమే ఉచిత విద్యుత్ అమలయ్యేలా చూడాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై ఆదివారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో ఆయా శాఖల ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష జరిపారు. విద్యార్థులకు యూనిఫామ్‌తో పాటు.. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు, పర్యవేక్షణ బాధ్యతలను స్వయం సహాయక మహిళా సంఘాలకు అప్పగించే అంశాన్ని పరిశీలించాలన్నారు. ఇతర రాష్ట్రాల ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి వాటిని రాష్ట్రంలో అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేసి.. టీ-శాట్ ద్వారా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో డిజిటల్ పాఠాలు అందించాలని, బడులపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుపై దృష్టిసారించాలని, సీఎస్‌ఆర్ ఫండ్స్ కోసం ప్రయత్నం చేయాలని, సౌకర్యాలను మెరుగుపరచేందుకు ఎన్నారైల సహకారం తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలన్నారు. స్కిల్ యూనివర్సిటీ కోసం ఐఎస్‌బీ తరహాలో గవర్నింగ్ బాడీని ఏర్పాటు చేయాలన్నారు. న్యాక్‌పై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలన్నారు. సచివాలయం నుంచి కిందిస్థాయి వరకూ ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టం (ఎఫ్‌ఆర్‌ఎస్) తీసుకువచ్చే అంశంపై సీఎం చర్చించారు. సమీక్షలో మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

'వక్ఫ్‌బోర్డు అనుమతి లేకుండా కమిటీ ఎలా వేస్తారు'

డోర్నకల్, మార్చి 10 : మునిసిపల్ కేంద్రంలోని మజీద్‌యే ఉస్మానియాకు నూతనంగా కమిటీని నియమించినట్లు కొందరు ముస్లిం మైనార్టీ నాయకులు ప్రకటించడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు వాజీద్ అన్నారు. ఆదివారం డోర్నకల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో డోర్నకల్ మజీద్‌యే ఉస్మానియా కమిటీ వివాదం వక్ఫ్‌బోర్డుకు చేరడంతో ఎలాంటి కమిటీలను ఏర్పాటు చేయకూడదని నాడు ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. ఈ వివాదం హైకోర్టు పరిధిలో ఉన్నందున ప్రస్తుతం ఎలాంటి కమిటీలను ఏర్పాటు చేయకూడదని వక్ఫ్‌బోర్డు ఆదేశాలు ఉండగా కొందరు వాటిని ధిక్కరించి నూతనంగా కమిటీని నియమించి ప్రకటన జారీ చేశారని విమర్శించారు. పైగా డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ ఆదేశాల మేరకే కొత్త కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రకటించుకున్నారని ఆరోపించారు. ఈ విషయమై ఎమ్మెల్యేకు కొందరు మైనార్టీ నాయకులు ఫిర్యాదు చేయగా ఎవరికి కమిటీ ఏర్పాటు చేసుకోవాలని చెప్పలేదని ఎమ్మెల్యే తెలిపినట్లు వారు చెప్పారు. ఎండి.జాఫర్, ఎండి.ఖాసీం, షెఖిలుల్లాఖాన్, ఎండి.జావేద్, ఫెరోజ్‌పాషా, ఎండి.నవాబ్ పాల్గొన్నారు.

'ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి'

గూడూరు, మార్చి 10 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు భరత్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. గూడూరులో ఆదివారం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు వేం వెంకటకృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగామాట్లాడుతూ ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. మండల అధికార ప్రతినిధి బానోత్ నర్సింహానాయక్, వైస్ఎంపీపీ ఆరె వీరన్న, నూకల సురేందర్, బోడ కిషన్, సోము సురేష్, కోడి రవి, రహీం, మన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



తొర్రూరులో సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు



కురవిలో సావిత్రిబాయి చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి



మానుకోట సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ ఫరీద్, మా అసోసియేషన్ బాధ్యులు

జిల్లాలో సావిత్రిబాయిపూలే వర్ధంతి

మహబూబాబాద్ టౌన్, మార్చి 10 : జిల్లా వ్యాప్తంగా మహనీయురాలు సావిత్రిబాయి పూలే వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఆమె విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహబూబాబాద్‌లో మా అసోసియేషన్ ఆధ్వర్యంలో చదువులమ్మ తల్లి సావిత్రిబాయిపూలే 127వ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎమ్డీ.ఫరీద్, మా అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డుపల్లి ఉపేంద్రం, టీపీసీసీ రాష్ట్ర అధికారప్రతినిధి చుక్కల ఉదయ్‌చందర్ మాట్లాడారు. స్త్రీవిద్యాభ్యున్నతికి కృషి చేసిన మొట్టమొదటిమహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, బొడ్డుపల్లి రజిత, కొమరమ్మ, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కామ సంజీవరావు, మల్లయ్య, రామకృష్ణ, సుధాకర్, యుగేందర్, దారా ఇందు భారతి, శివకుమార్, నదీమ్‌ఖాన్, మందుల రఘు, ఉప్పలయ్య వీరన్న, మాధురి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● మహబూబాబాద్ అంబేద్కర్ సెంటర్‌లో కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర జాయింట్ కోఆర్డినేటర్ పింగ్రాల రాందాసు ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివ, బాలకృష్ణ, దుర్గేష్, అంకుష్, విమల, రామ కమల, సురేష్, అజయ్, సంతోష్ పాల్గొన్నారు.

● భట్టు అంజయ్య భవన్‌లో పీవోడబ్ల్యూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకుని మంద పద్మ అధ్యక్షతన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ స్టడీసర్కిల్ ప్రధానకార్యదర్శి తండా సదానందం మాట్లాడుతూ అంతరాలులేని సమసమాజ స్థాపన కోసం తనజీవితాన్ని త్యాగం చేసిన ఆదర్శ విప్లవమూర్తి సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. పీవోడబ్ల్యూ జిల్లా కోశాధికారి సామరజిత, ఎన్డీ పట్టణ కార్యదర్శి టి.లక్ష్మయ్య, పి.కోటేష్, సామ పాపయ్య, ఎండీ. కవిత, కల్యాణి, అనిత, సునిత, ఉమా, పద్మ, యాకూబీ పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..

● కురవి మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే వర్ధంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. స్త్రీవిముక్తి కోసం పోరాడిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కామ సంజీవరావు, పోలెపాక వెంకన్న, సీపీఐ మండల కార్యదర్శి కర్నం రాజన్న, తురక రమేష్, కృష్ణ పాల్గొన్నారు.

● తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఉపేందర్‌రెడ్డి, కె.శ్రీనివాస్,భిక్షపతి, కిషన్‌నాయక్, రాజసుకన్య, జ్యోతి, మాధవి, యాకూబీ, మల్లేశం పాల్గొన్నారు.

●డోర్నకల్ మండలం రావిగూడెంలో తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే వర్ధంతిని నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కామ సంజీవరావు, ప్రధాన కార్యదర్శి నీరుటి సామెల్, కాటాం బాబు, సీతారాములు, వెంకటేశ్వర్లు, గడ్డం వెంకన్న, శంకర్, మేకల రాజేష్, పద్మ, నాగమ్మ, దర్శిని, రాజేశ్వరీ పాల్గొన్నారు.

● కేసముద్రం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పొదిల నర్సింహారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు తుంపిళ్ల శ్రీనివాస్, గాంతి వెంకట్‌రెడ్డి, నాగేశ్వరాచారి, ఉపేందర్, శ్రీనివాస్, రాములు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే సర్కారు లక్ష్యం

(3వ పేజీ తరువాయి)

సహకారంతో వరంగల్ తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుంచుతానన్నారు. రానున్న మూడేళ్లలో వరంగల్ మహానగరాన్ని అభివృద్ధితో కూడిన హరితనగరంగా అభివృద్ధి చేస్తామన్నారు. విశాలమైన రోడ్లు, జంక్షన్లు తదితర అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో శాసనసభ్యులు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, డాక్టర్ నెహ్రూనాయక్, మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్లు చింతాకుల అనిల్‌కుమార్, కాంగ్రెస్ నాయకుడు మీసాల ప్రకాష్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి



కేలోత్ వెంకన్న మృతదేహం

కేసముద్రం, మార్చి 10 : ధన్నసరి శివారు రేకులతండాకు చెందిన కేలోత్ వెంకన్న (40) స్థానిక జూనియర్ కళాశాల వెనుకవైపున ఉన్న తన వ్యవసాయ బావిలో ఆదివారం పడి మృతి చెందాడు. తండావాసులు తెలిపిన ప్రకారం. వెంకన్నకు రెండెకరాల వ్యవసాయ భూమి ఉం డగా ఎకరంన్నరలో మొక్కజొన్న, అరెకరంలో వరిసాగు చేస్తున్నాడు. ఉదయం నుంచి వెంకన్న తనచెల్కు వద్దనే పనులు చేస్తున్నారు. సాయంత్రం బావిలో వెంకన్న పడిపోయి ఉండడాన్ని ఆయన కుమారుడు గమనించి తండావాసులకు తెలిపాడు. తండావాసులు వెంకన్నను ఆయన్ను బావిలోంచి బయటకు తీయగా అప్పటికే ఆయన మృతి చెందాడు. అయితే బావిలో నీళ్లలోతు మోకాళ్ల వరకే ఉండగా వెంకన్న ఎలాపడిపోయాడు, ఎలా మృతి చెందాడనే విషయం తెలియరాలేదు. మృతుడికి భార్య బుజ్జి, ఇద్దరు కుమారులున్నారు. ఈ విషయంపై ఎస్ఐ వంశీధర్‌ను వివరణ కోరగా ఘటనపై ప్రాథమిక సమాచారం అందగా లిఖితపూర్వక ఫిర్యాదు అందలేదని, అయినప్పటికీ విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

'సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 10 : ఉద్యోగ, ఉపాధ్యాయులకు శాపంగా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎస్-యూటీఎఫ్ మహబూబాబాద్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు హరినాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మానుకోట మండల సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1వ తేదీన ఉద్యోగుల వేతనాలు ఇచ్చి రైతులకు రైతుబంధు ఆపడం సరికాదని చెప్పిన మాజీమంత్రి హరీశ్‌రావు తన మాటలను వెనక్కి తీసుకోవాలన్నారు. శ్రీనివాస్, కుమార్, నాగేశ్వర్‌రావు, ప్రసాద్, వీరస్వామి, మైసయ్య, భరత్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డీఎస్పీ

కేసముద్రం, మార్చి 10 : రాబోయే పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో కేసముద్రం మండలం పలు గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఆదివారం మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాల్లో అనుసరించాల్సినబందోబస్తు విధానాలను సూచించారు. ఆయనవెంట రూరల్ సీఐ సర్వయ్య, ఎస్ఐ ఎం.వంశీధర్ ఉన్నారు.

కీర్తనారెడ్డికి ఉమెన్ ఐకాన్ అవార్డు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 10 : మహబూబాబాద్ పట్టణానికి చెందినప్రభుత్వ ఉపాధ్యాయురాలు, కవయిత్రి, రచయిత్రి, అమ్మదీవెన చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సంకెపల్లి కీర్తనారెడ్డిని ఉమెన్ ఐకాన్ అవార్డుతో సత్కరించారు. హైదరాబాద్‌లోని శ్రీపొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఫిలింత్రోఫిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ అద్దంకి రాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభివాణీదేవి కీర్తనారెడ్డిని ఘనంగా సన్మానించారు. కీర్తనారెడ్డి గత 10 సంవత్సరాలుగా అమ్మదీవెన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవలందిస్తున్నందుకు గాను ఆమెకు ఉమెన్ ఐకాన్ అవార్డు రావడం అభినందనీయమన్నారు.

సరూర్‌నగర్‌లో మునిగలవీడు పాఠశాల

ఉత్సవాల సన్నాహక సమావేశం

మహబూబాబాద్ టౌన్, మార్చి 10 : నెల్లికుదురు మండలం మునిగలవీడు జడ్పీఎస్ఎస్ పాఠశాల 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏప్రిల్ 19, 20, 21 తేదీల్లో నిర్వహించతలపెట్టిన గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల సన్నాహక సమావేశాన్ని ఆదివారం హైదరాబాద్ సరూర్‌నగర్‌లో నిర్వహించారు. మునిగలవీడు పాఠశాలలో చదివి హైదరాబాద్‌లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులతో పాఠశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల నిర్వహణ కమిటీ బాధ్యులు సమావేశమయ్యారు. ఉత్సవాల నిర్వహణపై సుదీర్ఘంగా చర్చించారు. హైదరాబాద్‌లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు సలహాలు సూచనలు అందించారు. అనంతరం తమ వంతు సాయంగా 1995-96 బ్యాచ్ విద్యార్థులు రూ.10 లక్షల విరాళాన్ని ప్రకటించారు. మరి కొంతమంది నేరుగా విరాళాలు అందించారు. ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు బియ్యాల దేవేందర్‌రావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు దేశబోయిన వీరమల్లు, సలహాదారులు మరిగంటి గీతాచార్యులు, పల్లె ఉపేందర్, శంకరమంచి ఉపేంద్రశాస్త్రీ, కోమండ్ల సోమేశ్వర్‌రావు పాల్గొన్నారు.

రైల్‌రోకో పిలుపుతో అప్రమత్తమైన పోలీసులు



డోర్నకల్ 1వ నెంబర్ ప్లాట్‌ఫాంపై పోలీస్ బందోబస్తు

డోర్నకల్, మార్చి 10 : ఢిల్లీ శివారులో గత రెండునెలలుగా ఆందోళన చేస్తున్న రైతులు దేశవ్యాప్తంగా రైలురోకోకు ఆదివారం పిలుపునిచ్చారు. దీంతో డోర్నకల్ రైల్వే జంక్షన్‌లో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు అన్ని ప్లాట్‌ఫారాలపై తిరుగుతూ అనుమానితులను ఎక్కడికి వెళ్తున్నారని ప్రశ్నించారు. అనంతరం మధ్యాహ్నం వరకు బందోబస్తు నిర్వహించిన పోలీసులు రైలురోకోకు ఎవరూ రాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

వీరభద్రుడి సన్నిధిలో బలరాంనాయక్ ప్రత్యేక పూజలు

కురవి, మార్చి 10 : కురవి శ్రీ వీరభద్రస్వామి దేవాలయంలో కాంగ్రెస్ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థిగా ఖరారైన తర్వాత నేరుగా వీరభద్రస్వామి దేవాలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాంనాయక్ మాట్లాడుతూ వీరభద్రస్వామి దీవెనలతో ఎంపీగా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అవిరె మోహన్‌రావు పాల్గొన్నారు.



కేసముద్రం రెడ్డిఫంక్షన్ హాల్‌లో సమావేశమైన 2002-03 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కేసముద్రం, మార్చి 10 : కేసముద్రం స్టేషన్ జడ్పీ హైస్కూల్ 2002-03 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు స్థానిక రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి హెచ్ఎం స్వరాజ్‌బాబు, ఉపాధ్యాయులు రావుల ఉపేందర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, అజీజ్‌ఖాన్, నజీర్, పెండెం రాజవీరు, నమ్మాళ్వార్, మురళీకృష్ణ, దుర్గా ప్రసీద్, సాయిలు, బిల్లిపెల్లి లక్మారెడ్డి, జి.వెంకటేశ్వర్లు, కళ్యాణిలను సన్మానించారు. అప్పటి జ్ఞాపకాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో ఆబ్యాచ్ విద్యార్థులు నద్దునూరి అశోక్‌స్టాలిన్, మిట్టగడుపుల మహేందర్, చిట్ల సంపత్, లింగాల నేతాజి, ముదిగిరి సాంబయ్య, భూక్య బాలు, గొట్టం లవణ్, బోడ బాలరాజు, భూక్య వాల్య, జయ, ముల్కజ్యోతి, బాలమణి, సోలాపురపు స్వాతి పాల్గొన్నారు.

● గూడూరు : గూడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002-03 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 22 సంవత్సరాల అనంతరం ఒకే వేదికపై కలుసుకున్న స్నేహితులు నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉద్యోగ, ఉపాధి, వ్యాపార రంగాల్లో స్థిరపడ్డ స్నేహితులు ఆర్థికంగా వెనుకబడిన స్నేహితులను ముందుకు తీసుకువచ్చేందుకు నిర్ణయాలు తీసుకున్నారు. నాటి ఉపాధ్యాయులు వీరబ్రహ్మచారి, కొండూరి త్రిశూలం, రాంచందర్, రాజేందర్‌రెడ్డి, రజిత, అయూబ్‌ఖాన్, బిక్షపతి, సర్వన్, యాదగిరి, ప్రసాద్, పూర్వ విద్యార్థులు బీరవెల్లి శ్రీధర్, ఓం ప్రకాష్, ప్రసన్నకుమార్, బాబు, రాజు, నాగరాజు, వేణు, ఆజార్ పాల్గొన్నారు.



గూడూరు బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న 2002-03 పదో తరగతి విద్యార్థులు

కానిస్టేబుళ్లకు

సైబర్ నేరాలపై అవగాహన



నేరాల నివారణపై అవగాహన కల్పిస్తున్న సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

మహబూబాబాద్ రూరల్, మార్చి 10 : సైబర్ నేరాలను ఛేదించడం కోసం పోలీస్ కానిస్టేబుళ్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ వారియర్ శిక్షణ పొందిన కానిస్టేబుళ్లకు సైబర్ నేరాల నివారణ గురించి అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలోని ప్రతీ పోలీస్‌స్టేషన్ నుంచి ఒక కాని స్టేబుల్‌ను సైబర్ వారియర్స్‌గా నియమించి, శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. పోలీస్‌స్టేషన్‌కు సైబర్ నేరానికి సంబంధించిన దరఖాస్తు రాగానే వెంటనే స్పందించి కేసు నమోదు చేయాలని సూచించారు. ఫిర్యాదుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకుని బ్యాంకుఅకౌంట్, ఎలాంటి సైబర్ నేరం జరిగింది. ఏ నెంబర్ నుంచి ఫోన్ వచ్చింది.. ఫిర్యాదుకు సంబంధించిన ఫోన్ నెంబర్, ఈమెయిల్ ఐడీ, తదితర అంశాలను ఎఫ్ఐఆర్‌లో పొందుపరచాలన్నారు. సైబర్ నేరాలు జరుగకుండా ప్రతిరోజు ప్రజలకు అవగాహన కల్పిస్తూ సోష ల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో సైబర్ నేరాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గూర్చితగు సూచనలుచేసినట్లు సైబర్‌క్రైమ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు వివరించారు. నేషనల్ సైబర్ క్రైమ్ విభాగం హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు సమాచారం అందించాలన్నారు. గార్లమండలంరాజుతండాకు చెందిన ఎన్.రఘురాం అనే వ్యక్తికి సైబర్ నేరగాళ్లు ఫోన్‌చేసి, తాము బజాజ్‌ఫైనాన్స్ నుంచి మాట్లాడుతున్నాం. మీకు లోన్ ఇస్తామని మాయమాటలు చెప్పి, రిజిస్ట్రేషన్, ఫ్రీ ప్రాసెసింగ్ ఫ్రీ అంటూ మాయమాటలు చెప్పి బాధితుడి వద్ద రూ.48,249 ఆన్‌లైన్ నగదును తీసుకున్నట్లు చెప్పారు. ఇది గ్రహించిన బాధితుడు రఘురాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా 1930కి కాల్‌చేసి సైబర్‌సెక్యూరిటీ అధికారులు సైబర్ నేరగాళ్ల ఉపయోగించిన అకౌం ట్ నెంబర్‌ను ఫ్రీజ్ చేయడం జరిగిందన్నారు. ఎస్సై కరుణాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

● డీపీవో హరిప్రసాద్

తొర్రూరు రూరల్, ఫిబ్రవరి10 : వేసవికాలం దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని డీపీవో హరిప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో కాలనీల్లో ఎక్కడ నీటి సమస్య ఉన్న ముందస్తుగానే గుర్తించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఎంపీవో గౌస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● గూడూరు : గ్రామాల్లో రానున్న వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని డీపీవో హరిప్రసాద్ సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో మిషన్ భగీరథ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. గతంలోతాగునీటి కోసం ఉపయోగించిన బావులను, చేతిపంపులను శుభ్రం చేయించి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. మిషన్ భగీరథ ఈఈ కృష్ణారెడ్డి, డీఈశ్యాంగుప్తా, ఏఈ దినేష్, ఎంపీవో చంద్రమోహన్, కార్యదర్శులు పాల్గొన్నారు.

శేషజీవితాన్ని ఆనందంగా గడపాలి

● ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్

మహబూబాబాద్ రూరల్, మార్చి 10 : ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని, ఆ సమయంలో గడిపే శేషజీవితాన్ని ఆనందంగా గడపాలని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ అన్నారు. జిల్లా కేంద్రంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న ఎ.సంజీవ పదవీవిరమణ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఆదివారం సంజీవను శాలువాతో సత్కరించి మెమొంటోలు అందించారు. హోంగార్డు ఆఫీసర్ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

'సమస్యలను పరిష్కరించాలి'

మహబూబాబాద్ టౌన్, మార్చి 10 : సోడా తయారీ చేసే కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కుమ్మరికుంట్లనాగన్న డిమాండ్ చేశారు. పట్టణంలో సీఐటీయూ అనుబంధ సోడాయూనియన్ సమావేశాన్ని ఆదివారం వరిపెల్లి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన నాగన్న మాట్లాడుతూ సోడా కార్మికులు అడ్డాలులేక రోడ్లపై తిరుగుతూ అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోడాబండ్లు పెట్టుకునేందుకు స్థలం చూపించాలని కోరారు. అఫ్జల్‌పాషా, ముత్తయ్య, శ్రీను, శోభ, నారాయణ, వీరస్వామి, ఉపేందర్, ఖాసీం, వేణు, వెంకన్న, సురేష్, రమేష్ పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్, మార్చి 10 : జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సైనిక్ పాఠశాల, కళాశాలల్లో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన అర్హత పరీక్ష కేంద్రం వద్ద విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ ఆదివారం రాత్రి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ మండలం అయోధ్య గ్రామానికి చెందిన హెచ్.కృష్ణ, శనిగపురానికి చెందిన తేజావత్ వెంకన్న, అమనగల్‌కు చెందిన గుగులోతు మోహన్ పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్నారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న టౌన్ కానిస్టేబుల్ దేవేందర్ వారిని అడ్డుకున్నారు. దీంతో కాని స్టేబుల్‌ను పక్కకు నెట్టి విధులకు ఆటంకం కలిగించినల వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రజల తీర్పును గౌరవిస్తాం : రెడ్యా

నర్సింహులపేట, మార్చి 10 : ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామని మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వేంకటేశ్వర దేవస్థానం ప్రాంగణంలో ముఖ్యకార్యకర్తల సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా పార్టీ స్థితిగతులను కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. జయపురం, పెద్దనాగారం, రామన్నగూడెం, పడమటిగూడెం గ్రామాల నుంచి కొందరు కార్యకర్తలు ఇదివరకు అవలంబించిన తీరును రెడ్యానాయక్‌ను ప్రశ్నించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించి ప్రజలకు చేదోడు.. వాదోడుగా ఉంటామన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉండి పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఈ నెల 14న నర్సింహులపేట మండల కేంద్రంలో ఎన్నికల సన్నాహక సభ నిర్వహించబోతున్నామని, ప్రతీ గ్రామం నుంచి కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వరరెడ్డి, నర్సింహులపేట, దంతాలపల్లి పార్టీ మండల అధ్యక్షుడు మైదం దేవేందర్, వేణు, జిన్నగడ్డ వెంకన్న, బండ బిక్షంరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

● దంతాలపల్లి : అసెంబ్లీ ఎన్నికల్లో సొంత పార్టీ వారే మోసం చేసి ఓడించారని మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు.ఆదివారం ఆయన మండలంలోని కుమ్మరికుంట్లలో ముఖ్యకార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో ఈ నెల 15న దంతాలపల్లిలో మండలస్థాయి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమాజంలో గెలుపు ఓటములు సహజమన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు వేణు, నాయకులు వలాద్రి మల్లారెడ్డి, రాములు, రామూర్తి పాల్గొన్నారు.

'కార్పొరేట్లకు దోచిపెడుతున్న పార్టీలను ప్రతిఘటిద్దాం'

చిన్నగూడూరు, మార్చి 10 : ప్రభుత్వ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్న పార్టీలను ప్రతిఘటించడానికి ప్రగతిశీల శక్తులు ఏకంకావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఐ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఉపాధిలేమి, అధిక ధరలతో ప్రజలు బాధపడుతుంటే, పది సంవత్సరాల కాలంలో సృష్టించిన సంపదలో 40శాతం కుబేరులకు చేరిందని ఆరోపించారు. నాలుగేళ్లలో నిరుపేదల సంఖ్య 19 కోట్ల నుంచి 35 కోట్లకు పెరిగిందని వివరించారు. సీపీఐ మండల కార్యదర్శి గంజి శేషాద్రి రెడ్డి, బ్రహ్మం, స్టాలిన్, వెంకన్న ఉన్నారు.

'బీజేపీ జెండాను ఎగరేస్తాం'

మరిపెడ, మార్చి 10 : మానుకోట గడ్డపై రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరేస్తామని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మాచెర్ల నవీన్ అన్నారు. ఆదివారం మరిపెడలో ఏర్పాటు చేసిన ఆ పార్టీ బూత్ లెవల్, ఆ పైస్థాయి కార్యకర్తల సమావేశానికి నవీన్ హాజరై మాట్లాడారు. పీఎం నరేంద్రమోదీతోనే దేశం అగ్ర రాజ్యాల సరసన చేరిందని గుర్తు చేశారు. బింగి రమేశ్, గంగాధర్, రజినీకాంత్, మధు, ఎడెల్లి సుమన్, లక్ష్మణ్, బావుసింగ్, సాయి, విజయ్ పాల్గొన్నారు.

'నేటి నుంచి బ్రహ్మోత్సవాలు'

తొర్రూరు, మార్చి 10 : డివిజన్ కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నుంచి 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు, స్థానాచార్యులు ఓలేటి యాదగిరాచార్యులు తెలిపారు. సోమవారం ఉత్సవాలు ప్రారంభమవుతాయని అభిషేకం, అర్చనలు, 12న ధ్వజారోహణం, 13న సాయంత్రం 7గంటలకు వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం అత్యంత వైభవోపేతంగానిర్వహించడం జరుగుతుందన్నారు. 14న మహాపూర్ణావతి, చక్రతీర్థం తదితర కార్యక్రమాలు ఉంటాయని భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం'

తొర్రూరు, మార్చి 10 : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బొమ్మగాని ఆదిత్య కుటుంబాన్ని విధాలుగా ఆదుకుంటామని కాంగ్రెస్ నాయకుడు పెదగాని సోమయ్య అన్నారు. ఆదివారం తొర్రూరులోని ఆదిత్య కుటుంబసభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సుంచు సంతోష్, నాయకులు రాంచంద్రయ్య, సురేందర్ రెడ్డి, ముద్దసాని సురేష్, వెంకటాచారి, కుషాల్, బిజ్జాల అనిల్, దొంగరి శంకర్, రమేష్, శ్రీకాంత్, వెంకన్న ఉన్నారు.

'ఎంపీపీ భర్తను కాంగ్రెస్‌లోకి తీసుకోవద్దు'

నర్సింహులపేట : ఎంపీపీ టేకుల సుశీల భర్త యాదగిరి రెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి తీసుకోవద్దని పెద్దనాగారం స్టేజి దగ్గర పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బ సోమిరెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల ప్రభుత్వ హయాంలో ఎంపీపీ భర్త యాదగిరిరెడి కాంగ్రెస్ కార్యకర్తలను ముప్పుతిప్పలు పెట్టారని, అక్రమ కేసులు పెట్టి, నానా ఇబ్బందులకు గురి చేశాడని గుర్తు చేశారు. అలాంటి నీతిలేని నాయకుడు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరడం నీతిమాలిన రాజకీయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అజ్మీర రాజేందర్, చెలమల్ల భాస్కర్, కృష్ణారెడ్డి, బాలనాల ప్రవీణ్, నరేష్ ఉన్నారు.

● దంతాలపల్లి : కాంగ్రెస్ పార్టీలోకి బీఆర్ఎస్ నాయకులను తీసుకోవద్దని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భట్టునాయక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల పార్టీ అధ్యక్షులు బీఆర్ఎస్ ముఖ్యనాయకులను తీసుకోవద్దంటూ తీర్మానం చేశారు. ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌కు గత పదేళ్లుగా అందుబాటులో ఉండి గెలిపించామన్నారు. నాయకులు పొన్నోటి బాలాజీ, నవీన్‌రెడ్డి, ఎంపీటీసీ హంజీభద్రూనాయక్, శ్రీనివాస్‌రెడ్డి, లింగారెడ్డి, గృపాల్ రెడ్డి, ఎంపీటీసీ యాకన్న, సతీష్, అక్కిర వెంకటేశ్వర్లు, రాములు, పోట్యానాయక్, రమేష్ పాల్గొన్నారు.

'ఆర్టీసీ ఉద్యోగులకు ఫిట్‌మెంట్ ఇవ్వడం హర్షనీయం'

తొర్రూరు, మార్చి 10 : ఆర్టీసీ ఉద్యోగులు దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న పీఆర్సీ సమస్యను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించడం అభినందనీయం అని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సుంచు సంతోష్, డీఎం విశ్వనాథ్ అన్నారు. ఆదివారం ఆర్టీసీ డిపో ఆవరణలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్‌చేసి, వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు 21శాతం ఫిట్‌మెంట్ ఇవ్వడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రతీ ఉద్యోగికి రూ.8వేల నుంచి 11వేల వరకు వేతనం పెరుగుతుందని, రాష్ట్ర వ్యాప్తం గా ఉన్న సుమారు 53వేల మంది ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రభుత్వంపై అదనపు భారం పడుతున్నా ఉద్యోగుల సంక్షేమం కోసమే ప్రభుత్వం ఫిట్‌మెంట్ ప్రకటించిందన్నారు. ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు 2017 పే స్కేల్‌ను సవరించి 21 శాతం ఫిట్‌మెంట్ అమలు చేసేందుకు నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, నాయకులు సురేష్, రవీందర్‌రెడ్డి, రవీందర్, బిజ్జాల అనిల్, యాకయ్య, నాగన్న, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.